క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం



చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు షాద్‌నగర్‌లో ఘన స్వాగతం పలికారు. మంగళవారం హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ మీదుగా దేవరకద్రకు వెళ్తున్న కవిత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి షాద్‌నగర్‌లో తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు కవితకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తాఫా, రమేశ్ నాయక్, శివ, రాజ్యలక్ష్మి, బాలాజి, ఉదయ్, రవిగౌడ్, బాబు, రాజు, గణేశ్ నాయక్, చెన్నయ్య, మల్లేశ్, సల్మాన్, వంశీ ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ నాయక్



మాట్లాడుతున్న రవీందర్ నాయక్

షాద్‌నగర్: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. హెల్మెట్లు ధరించకపోవడంతోనే చాలా మంది ప్రయాణికులు మృత్యువాతపడ్డారని గుర్తుచేశారు. విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఆకృతి ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ



అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ తదితరులు

షాబాద్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆకృతి ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ సూచించారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను బడికి పంపితే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి, భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. పిల్లలను పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ, ఎస్‌ఎంసీ సభ్యులు తదితరులున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

సర్పంచ్ రవీందర్

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని సర్పంచ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లిలోని క్రీడాకారులకు, యువకులకు ప్రభుత్వం నుంచి మంజూరైన వాలీబాల్, క్రికెట్ కిట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సర్పంచ్ అందజేశారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, నాయకులు.. శ్రీశైలం, చెన్నయ్య, రహీమ్, ఈదమయ్య, జంగయ్య, వెంకటేశ్, శేఖర్, జంగయ్య, చెన్నయ్య, సత్యనారాయణ ఉన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లికి నూతనంగా మంజూరైన రేషన్‌షాపును మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, కౌన్సిలర్ కమటం రాధమ్మ ప్రారంభించారు. రేషన్ సరుకులను సకాలంలో, సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ మాధవి, మాజీ ఎంపీపీ ధనుంజయ, స్థానిక నాయకులు కమటం వెంకటయ్య, శ్రీపాల్, అనంతరాములు, యాదగిరి, కిష్టయ్య, మహేశ్, రవి, భాస్కర్, నరేశ్, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్.. పరేషాన్

- విచ్చలవిడిగా వినియోగం
- ఎటు చూసినా కవర్లు, వ్యర్థాలు
- ప్లాస్టిక్ కోరల్లో పర్యావరణం
- కొరవడిన నియంత్రణ చర్యలు



పారిశ్రామికవాడలో పాలిథిన్ వ్యర్థాలు

నందిగామ: పాలిథిన్ వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోంది. నిషేధం ఉన్నా అన్ని పట్టణాలు, గ్రామాల్లో పాలిథిన్ కవర్ల వాడకం తగ్గడం లేదు. ఫలితంగా వ్యర్థాలు పేరుకుపోయి రోగాలకు కారకాలుగా నిలుస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఎక్కడ చూసిన పాలిథిన్ కాగితాలు, కవర్లు దర్శనమిస్తున్నాయి. రోజురోజుకు వినియోగం పెరగడంతో పర్యావరణానికి పెను ముప్పుగా మారింది.

పేరుకుపోతున్న వ్యర్థాలు

మండల పరిధిలోని పలు గ్రామాలతో పాటు పారిశ్రామిక వాడ, అయ్యప్ప స్వామి కాలనీలో పాలిథిన్‌ను అధికంగా వాడుతున్నారు. స్థానికులతో పాటు, పరిశ్రమల నిర్వాహకులు కూడా పాలిథిన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో.. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శన మిస్తున్నాయి. పాలిథిన్ సంచులను మురుగు కాలువల్లో వేయడంతో నీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద అధికమవుతోంది.

నిబంధనల ఉల్లంఘన

పాలిథిన్ వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. వేడిగా ఉండే ఆహార పదార్థాలు వీటిలో తీసుకెళ్లడం ద్వారా క్యాన్సర్ ప్రబలే అవకాశం ఉందని వీటిని నిషేధిస్తూ గతంలోనే ప్రభుత్వం ఆదేశాలు కూడా ఇచ్చింది. నిబంధనలు ఉల్లంఘిస్తూ విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులిచ్చి, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తనిఖీలు చేసి నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేయాల్సిన అధికారులు అటు వైపే చూడటం లేదు. 2016లో రూపొందించిన నిబంధనల ప్రకారం 50 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న పాలిథిన్ సంచులు, ఇతర వస్తువులు విక్రయించరాదు. తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లు విక్రయించిన దుకాణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కల్గించే పాలిథిన్ కవర్ల వాడకంపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాలిథిన్ కవర్ల వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉంది. ముఖ్యంగా నిరక్షరాస్యులకు వీటివల్ల కలిగే అనర్థాలను వివరించాలి. అధికారులు తరచూ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలా చేయడం వలన పాలిథిన్ విక్రయించడం, వాడకం తగ్గే అవకాశం ఉంది.

పాలిథిన్ కవర్లను నిషేధించాలి

పాలిథిన్ కవర్ల తయారీని ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలి. కవర్ల తయారీలో వెసులుబాటు ఉండడంతో కొంతమంది నిబంధలకు విరుద్ధంగా తయారు చేస్తున్నారు. వినియోగదారులకు కూడా అవగాహన లేకపోవడంతో వినియోగిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి.

– సూక్య నాయక్, మేకగూడ

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- మండల విద్యాధికారి అక్బర్
- చేవెళ్లలో పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చేవెళ్ల: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి అక్బర్ సూచించారు. చేవెళ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని చెప్పారు. వార్షిక క్యాలెండర్ ప్రకారం బోధనను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రమణారెడ్డి, చేవెళ్ల ప్రధానోపాధ్యాయురాలు మోహరున్నిషాబేగం, శ్రీనివాస్, మల్కాపూర్ ప్రధానోపాధ్యాయుడు పురందాస్, మండలశాఖ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు జనార్దన్‌రెడ్డి, క్రిష్ణగౌడ్, జయకృష్ణ, శివకుమార్, రామచంద్రయ్య, వేణు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ నాయకులు 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల కమిటీ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విల్సన్ సునీల్, పీఆర్‌టీయూ నాయకులు జగన్, కృష్ణ, సంజీవరెడ్డి, తులసీకృష్ణ, శ్రీనివాస్, వెంకటరావు, పార్వతమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రిన్సిపాల్ టేనావతి

చేవెళ్ల: తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని చేవెళ్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. చేవెళ్లలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహిస్తారని తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, 7వ తరగతి నుంచి 10 వతరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తులకు జనరల్ విద్యార్థులకు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ ఇతర విద్యార్థులకు రూ. 125 అడ్మిషన్ ఫీజు ఉంటుందని తెలిపారు. హాల్‌టికెట్లను ఆల్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

భూములు అన్యాక్రాంతం కానివ్వం

- లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు
- పనులను పర్యవేక్షించిన దేవాదాయ శాఖ అధికారులు



కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్: ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన భూములు మండల కేంద్రంలో సర్వే నంబర్ 76లో 6.05 ఎకరాలు, మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో సర్వేనంబర్ 130లో 3.06 ఎకరాలు, సర్వేనంబర్ 120లో 15.31 ఎకరాలు, సర్వేనంబర్ 125లో 9.32 ఎకరాల భూములు ఉన్నాయి. కాగా ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని గతంలో ఆరోపణలు రావడంతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూములకు ల్యాండ్ ఏడీ ద్వారా సర్వే చేయించారు. ఈమేరకు ప్రజాప్రతినిధులతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం ఆలయ భూములకు కంచె ఏర్పాటు పనులను ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు, మండల ఇన్‌చార్జి ఈఓ స్నేహలత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్ ఈ పనులను పర్యవేక్షించారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటాం..

దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 120లో అక్రమణకు గురైన 1.28 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా సర్వే నెంబర్ 120లో మరో 26 గుంటల భూమి కూడా అన్యాక్రాంతమైందని.. రెండుమూడు రోజుల్లో సమీప రైతు వ్యవసాయ పొలానికి తిరిగి సర్వే నిర్వహించి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 130లో 128 గజాల్లో ఒకరు ఇంటి నిర్మాణం చేపట్టారని, అదే విధంగా 222 గజాల్లో అన్మాస్‌పల్లిలో వాటర్‌ట్యాంకు, జీపీ కార్యాలయం, స్కూల్‌ను నిర్మించడం జరిగిందని.. దీనికి సంబంధించి అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి నోటీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 125లో కంచె ఏర్పాటు చేస్తుండగా సమీపంలోని ఓ వెంచర్ నిర్వాహకులు అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డుకున్నారు. ఈ భూమి తమదని, దేవాలయ భూమి కాదని అధికారులతో వాదనకు దిగారు. తిరిగి రెండు రోజుల్లో సర్వే చేపడదామని అప్పటివరకు కంచె ఏర్పాటు చేయవద్దని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సరే అని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శాయిరెడ్డి, బాబు, వార్డుసభ్యులు భిక్షపతి, మల్లయ్య,రాజు, రామకృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

పీఎం జన్‌మన్‌తో ఆదివాసీల అభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కడ్తాల్: చెంచు, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ్ అభియాన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లితో పాటు, పలు చెంచు కాలనీల్లో ఆయా చెంచు కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. జన్‌మన్ పథకంలోని 11 రకాల లాభాలను వివరించారు. సురక్షిత మంచినీరు, వృత్తి నైపుణ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్‌కార్డులు, కుల సర్టిఫికెట్ పలు అంశాలపై అవగాహన సమావేశాలు నిర్వహించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో మంగళవారం ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు ముందు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. కాలనీ వాసులు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, యువకులు కేరింతలు, పోతరాజుల విన్యాసాలు పలువురిని అలరించాయి.



బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం

- అభివృద్ధిలో భాగస్వాములుకండి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ తదితరులు

షాద్‌నగర్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో కుమ్మరి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, తాలుక అధ్యక్షుడు శ్రీశైలం, శ్రీనివాస్, కృష్ణయ్య, శ్రీశైలం, రమేశ్, యాదయ్య, వెంకటేశ్, నర్సింహులు, శివశంకర్‌గౌడ్, తులసీరాం నాయక్, తిరుపతిరెడ్డి, కుమార స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పండి
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోఅన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెండు ఎంపీ స్థానాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, షాద్‌నగర్ నియోజవర్గం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, హరినాథ్‌రెడ్డి, వీరేశం, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, జగదీశ్, బాబర్‌ఖాన్, రఘు, తిరుపతిరెడ్డి, పల్లె ఆనంద్, సుదర్శన్‌గౌడ్, తులసీరాం, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

- తగ్గిన ఉత్పత్తి
- భారీగా పెరిగిన ధర
- రిటైల్ మార్కెట్‌లో రూ. 8



షాబాద్: నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మొన్నటి వరకు ఉల్లిగడ్డలు, టమోటాల ధరలు ఆకాశాన్నంటగా.. ప్రస్తుతం కోడిగుడ్ల వంతు వచ్చింది. కార్తీక మాసంలో మాంసాహార వినియోగం తక్కువగా ఉండడంతో ధరలు అదుపులో ఉన్నట్లు కనిపించాయి. కార్తీక మాసం ముగియడంతోనే కోడిగుడ్లకు రెక్కలొచ్చాయి. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5.50 ఉండగా.. వారం క్రితం రూ.6కు చేరింది. డజన్ గుడ్ల ధర వారం రోజుల్లో రూ.72 నుంచి రూ.84కు చేరింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ఒక గుడ్డు రూ.8కు అమ్ముతున్నారు. చలి తీవ్రత పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో కోడిగుడ్ల ధర పెరుగుతోందని భావిస్తున్నారు. అలాగే చికెన్ ధర కూడా పెరుగుతోంది. గత నెలలో కిలో చికెన్ ధర రూ.160 నుంచి రూ.190లోపు ఉంది. ప్రస్తుతం చికెన్ ధర రూ.250కి చేరింది. రానున్న రోజుల్లో చికెన్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు.

చందనవెల్లిలో మహాపడి పూజ



పూజలో పాల్గొన్న మధుసూదన్‌రెడి తదితరులు

షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో మంగళవారం అయ్యప్ప మహాపడి పూజ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పమాలధారులు ఆలపించిన అయ్యప్ప పాటలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. స్వామియే శరణం.. శరణం.. శరణం అయ్యప్పా అంటూ అయ్యప్ప స్వాములు భక్తి గీతాలు ఆలపించారు. అయ్యప్ప నామస్మరణతో చందనవెల్లి మార్మోగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు రవీందర్‌నాయక్, యాదయ్య, సుభాశ్‌రెడ్డి, దయాకర్, కిషోర్, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, రాఘువేందర్, తదితరులున్నారు.

ఇనాంగూడలో ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్యాంక్ ఆఫ్ బరోడా బాటసింగారం బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనాంగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ అంతటి యశోద ఉషయ్య గౌడ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేశం అచిలేష్‌గౌడ్, ఇబ్రహీంపట్నం డీఎంహెచ్‌ఓ డా.ధరణి, డా.సత్యప్రకాష్, డా.కల్పన, బ్యాంక్ ఆఫ్ బరోడా బాటసింగారం బ్రాంచ్ మేనేజర్ ఎల్.రమేష్, బ్రదర్ సింగ్, వార్డుసభ్యులు, హెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్ వైజర్ చంద్రశేఖర్, ఏఎస్‌ఎం భాగ్య, హెచ్‌ఏ యాదగిరి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారులు